# మనం
# మహబూబ్‌నగర్
## నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

సోమవారం | 19 | అక్టోబర్ | 2026 | పేజీలు 10 | www.manamepaper.com


## నేటి ప్రజావాణి రద్దు



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 18 (మనం బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జిల్లా అధికారులు పరిపాలనా సంబంధిత విధుల్లో నిమగ్నమై ఉండనున్న నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ప్రజావాణి కోసం జిల్లా కార్యాలయానికి వచ్చి అసౌకర్యానికి గురికావద్దని సూచించారు.



# సద్దుల సంబురం

### రంగురంగుల పూల బతుకమ్మలతో మైదానంలో పండుగ శోభ

**జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. తొమ్మిది రోజులపాటు కొనసాగిన బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన సద్దుల బతుకమ్మ వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని సందడి చేశారు.**



మహబూబ్‌నగర్, అక్టోబర్ 18, మనం ప్రతినిధి: రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు మైదానానికి ప్రత్యేక

- మిగతా 10లో..

"సర్వమంగళ మాంగళ్యే శివే
సర్వార్థ సాధికే।
శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోస్తుతే॥"



## దుర్గాదేవి అలంకారంలో భవానీ మాత

కొత్తకోట, అక్టోబర్ 18 (మనం న్యూస్): పట్టణకేంద్రం లోని శ్రీ అంబా భవానీ దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో

- మిగతా 10లో..



# కరువు కోరల్లో నారాయణపేట



### వర్షం కోసం ఎదురుచూసి.. వలస బాట పట్టే బతుకులు

### నీరు లేక ఎండిన వరి పొలాలు.. పశువులకు మేతగా మారిన పంటలు

### సాగునీటి భరోసా కరువు.. తాగునీటి సంక్షోభం ముంచుకొచ్చే ప్రమాదం

## అన్నదాతలకు కన్నీళ్లు మిగిల్చిన వానకాలం!

*ఒకప్పుడు వాన చినుకు పడితే చాలు.. రైతు ముఖంలో ఆనందం వెల్లివిరిసేది. పొలంలో నాగలి కదిలేది.. నేలలో విత్తనం మొలకెత్తేది. పచ్చని పంటలతో పల్లెలు కళకళలాడేవి. కానీ నేడు అదే నేల వాన చినుకు కోసం ఆకాశం వైపు దీనంగా ఎదురుచూస్తోంది. పొలాల్లో పచ్చదనం కనిపించాల్సిన సమయంలో ఎండిన వరి పంటలు దర్శనమిస్తున్నాయి. పంట చేతికొస్తుందని ఆశపడ్డ రైతన్నకు నిరాశే మిగిలింది.*

*- నారాయణపేట అక్టోబర్ 18(మనం న్యూస్)*



వివరాలు 2లో..

# కరువు కోరల్లో నారాయణపేట



నారాయణపేట అక్టోబర్ 18(మనం న్యూస్) : కష్టపడి సాగు చేసిన వరి పంటకు నీరు అందకపోవడంతో కొందరు రైతులు చేసేదేమీ లేక పశువులకు మేతగా వదిలేస్తున్నారు. మరోవైపు, వ్యవసాయ పనులు లేక కూలీలకు ఉపాధి కరువవుతోంది. చివరకు కుటుంబాన్ని పోషించుకోవడం కోసం సొంత ఊరిని వదిలి ముంబై, పుణె వంటి నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఇదీ నారాయణపేట జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న దయనీయ పరిస్థితి. వర్షాధార వ్యవసాయం, పరిమిత సాగునీటి వసతులు, స్థానికంగా ఉపాధి అవకాశాల కొరత ఈ మూడు అంశాలు కలిసివచ్చి జిల్లాలోని అనేక కుటుంబాల జీవితాలను సంక్షోభంలోకి నెడుతున్నాయి. వానాకాలం వచ్చి వెళ్లిపోతున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. పంటలు ఎండిపోతుండగా, రానున్న నెలల్లో తాగునీటి అవసరాలు ఎలా తీర్చుకోవాలనే ఆందోళన ప్రజలను వెంటాడుతోంది.కరువు అంటే కేవలం వర్షం పడకపోవడం కాదు.. ఒక ప్రాంతపు వ్యవసాయాన్ని, ఉపాధిని, ఆర్థిక వ్యవస్థను, చివరకు ప్రజల జీవన విధానాన్ని సైతం కుదిపేసే సంక్షోభం. నారాయణపేటలో ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితి ఇదే ప్రశ్నను మన ముందుంచుతోంది.

### వానాకాలం వెళ్లిపోతోంది.. వరుణుడి జాడేది?

వానాకాలం వచ్చిందంటే నారాయణపేట జిల్లా రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తాయి. తొలి వర్షం కురవగానే పొలాలను సిద్ధం చేసుకుని విత్తనాలు విత్తుతారు. పెట్టుబడుల కోసం అప్పులు చేస్తారు. పంట పండితే అప్పులు తీర్చుకోవచ్చని, కుటుంబ అవసరాలు తీర్చుకోవచ్చని ఆశపడతారు. కానీ వర్షాలు సకాలంలో కురవకపోతే వారి ఆశలు ఆవిరవుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వానాకాలం ముగింపు దశకు చేరుకుంటున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. అప్పుడప్పుడు కురిసిన వర్షాలు నేలను తడిపినా, పంటలకు అవసరమైనంత నీటిని అందించలేకపోయాయి. ముఖ్యంగా నీటి అవసరం ఎక్కువగా ఉండే వరి పంటకు ఈ పరిస్థితి తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. వరి సాగు చేసిన రైతులు పంటను కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. బోరుబావుల్లో నీరు లేకపోవడం, చెరువులు, కుంటల్లో సరిపడా నీరు నిల్వ లేకపోవడం, ఇతర నీటి వనరులు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పంట చేతికొచ్చే దశలో నీరు అందకపోతే నెలల తరబడి చేసిన శ్రమ, పెట్టిన పెట్టుబడి వృథా అవుతున్నాయి. జిల్లాలోని అనేక గ్రామాలకు వెళ్లి చూస్తే ఎండిపోయిన వరి పొలాలు రైతుల దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. పచ్చగా కళకళలాడాల్సిన పొలాలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. పంటను కాపాడుకోవడానికి మరో రూపాయి ఖర్చు చేసినా ప్రయోజనం ఉండదని భావించే పరిస్థితిలో కొందరు రైతులు పంటను పశువులకు మేతగా వదిలేస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా అనేక రైతులు వరి పంటను పశువులకు మేతగా వదిలేశాడంటే అది కేవలం వ్యవసాయ నష్టం మాత్రమే కాదు. ఆ కుటుంబం పెట్టుకున్న ఆశలు, చేసిన అప్పులు, పడిన శ్రమ అన్నీ కళ్లముందే కరిగిపోతున్నాయనే బాధకు అది ప్రతీక.

### ఎల్‌నినో ప్రభావం.. వర్షాలపై అనిశ్చితి..

వాతావరణ మార్పులు, వర్షపాతం అసమానతలు వ్యవసాయ రంగానికి కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఎల్‌నినో వంటి సముద్ర ఉష్ణోగ్రతలకు సంబంధించిన వాతావరణ దృగ్విషయాలు ప్రపంచవ్యాప్తంగా వర్షపాత నమూనాలపై ప్రభావం చూపగలవు. అయితే ఒక నిర్దిష్ట ప్రాంతంలో వర్షాలు తక్కువగా కురవడానికి ఎల్‌నినో ఒక్కటే కారణమని చెప్పలేం. స్థానిక వాతావరణ పరిస్థితులు, రుతుపవనాల కదలికలు, వర్షాల విస్తరణ, ఇతర వాతావరణ అంశాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. నారాయణపేట జిల్లాలో ప్రస్తుతం కనిపిస్తున్న వర్షాభావ పరిస్థితులు రైతుల ఆందోళనను పెంచుతున్నాయి. కొద్దిపాటి వర్షాలు కురిసినా అవి పంటల అవసరాలను తీర్చలేకపోతున్నాయి. పంటల పెరుగుదలకు కీలకమైన సమయంలో వర్షాలు అందకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. రాష్ట్రంలోని అతి తక్కువ వం–ర్షపాతం నమోదైన జిల్లాగా నమోదవడం బాధాకరమైన అంశం. ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా అడ్డుకోలేకపోయినా వాటి ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. కానీ అందుకు ముందస్తు ప్రణాళికలు, నీటి నిర్వహణ, పంటల ఎంపిక, రైతులకు సకాలంలో సలహాలు అవసరం. ప్రతి సంవత్సరం వర్షాలు తగ్గినప్పుడు మాత్రమే స్పందిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు.

### వర్షాధార వ్యవసాయమే ఆధారం.. వర్షమే రైతన్నకు జీవనాధారం!

నారాయణపేట జిల్లా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తోంది. రైతులతో పాటు వ్యవసాయ కూలీలు, పశుపోషకులు, చిన్న వ్యాపారులు కూడా వ్యవసాయంపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే పొలాల్లో పనులు పెరుగుతాయి. విత్తనాలు విత్తడం నుంచి కలుపు తీయడం, ఎరువులు వేయడం, పంట కోత వరకు వ్యవసాయ కూలీలకు పని లభిస్తుంది. రైతులకు ఆదాయం వస్తే గ్రామాల్లో కొనుగోళ్లు పెరుగుతాయి. చిన్న వ్యాపారాలు కూడా నడుస్తాయి. అదే వర్షాలు కురవకపోతే ఈ గొలుసు మొత్తం దెబ్బతింటుంది. పంటలు సాగు కాకపోతే కూలీలకు పని ఉండదు. రైతులకు ఆదాయం రాదు. గ్రామాల్లో నగదు చలామణి తగ్గుతుంది. వ్యవసాయంపై ఆధారపడిన చిన్న వ్యాపారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటారు. అంటే వర్షాభావం ప్రభావం రైతు పొలానికే పరిమితం కాదు. అది గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థను మొత్తం కుదిపేస్తుంది. జిల్లాలో అత్యధిక ప్రాంతాలలో వర్షాధార వ్యవసాయంపై అధికంగా ఆధారపడటం వల్ల ఈ సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. సాగునీటి సదుపాయాలు పరిమితంగా ఉండటంతో రైతులు ప్రకృతి కరుణపైనే ఆధారపడాల్సి వస్తోంది.



### సాగునీటి భరోసా ఏది? దశాబ్దాల సమస్యకు పరిష్కారం ఎప్పుడు?

ప్రతి ఏడాది వర్షాభావం ఎదురైనప్పుడు రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. వర్షాలు కురవకపోతే బోరుబావులు, చెరువులు, కుంటల వైపు చూస్తున్నారు. అక్కడ కూడా నీరు లేకపోతే చివరకు పంటలను వదులుకోవాల్సి వస్తోంది. నారాయణపేట జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల సామర్థ్యాన్ని సమగ్రంగా పరిశీలించాలి. ఇప్పటికే ఉన్న నీటిపారుదల సదుపాయాలను మరింత సమర్థంగా వినియోగించుకోవాలి. ప్రతిపాదిత ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న పనులు, భూసేకరణ సమస్యలు, నిధుల కేటాయింపులపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలి. అయితే కేవలం చెరువులు నిర్మించడం లేదా పూడికతీత చేపట్టడం మాత్రమే సరిపోదు. నీటి వనరుల పరిరక్షణ, వాటి నిర్వహణ, నీటి వినియోగంపై గ్రామస్థాయిలో ప్రణాళిక ఉండాలి. ఏ గ్రామంలో ఎంత నీరు అందుబాటులో ఉంది? ఎంత భూమికి సాగునీరు అందించగలుగుతాం? తాగునీటి అవసరాలకు ఎంత నీరు కేటాయించాలి? అనే అంశాలపై శాస్త్రీయ అంచనాలు అవసరం.

### పశువులకు మేతగా మారిన వరి పంట.. రైతు గుండెల్లో ఆవేదన!

వరి పంటను సాగు చేయడం అంటే కేవలం విత్తనాలు చల్లడం కాదు. పొలం సిద్ధం చేయడం, నాట్లు వేయడం, ఎరువులు, కూలీల ఖర్చులు, నీటి నిర్వహణ.. ఇలా ప్రతి దశలో రైతు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. పంట చేతికొచ్చే వరకు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తాడు. కానీ నీరు అందక పంట ఎండిపోతే రైతు చేతిలో మిగిలేది నష్టం మాత్రమే. ప్రస్తుతం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్న ఎండిన వరి పొలాలు ఈ వాస్తవాన్ని గుర్తుచేస్తున్నాయి. పంటను కాపాడుకోవడానికి అవకాశం లేకపోవడంతో కొందరు రైతులు పశువులకు మేతగా వదిలేస్తున్నారు. పంటను పండించి మార్కెట్‌కు తీసుకెళ్లాల్సిన రైతు, చివరకు దానిని పశువులకు ఆహారంగా వదిలేయాల్సిన పరిస్థితి ఎంత బాధాకరమో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు నష్టం ఎంత జరిగిందో అంచనా వేయడం అత్యంత ముఖ్యం. మండలాల వారీగా పంటల పరిస్థితిని పరిశీలించి, సాగు విస్తీర్ణం, దెబ్బతిన్న పంటల వివరాలు, రైతుల పెట్టుబడి నష్టాలను నమోదు చేయాలి. పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం, పంట బీమా ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలి. పంట పూర్తిగా దెబ్బతిన్న రైతులకు తదుపరి సాగు కోసం అవసరమైన సలహాలు, విత్తనాల సహాయం, రుణాల విషయంలో తగిన వెసులుబాటు కల్పించే అంశాలను పరిశీలించాలి.

### పంటలు ఎండితే.. వలసల బాట పట్టాల్సిందేనా?

నారాయణపేట జిల్లా గురించి ప్రస్తావన వచ్చినప్పుడు కరువు, వలసల సమస్యలు తరచూ చర్చకు వస్తుంటాయి. వర్షాభావం కారణంగా వ్యవసాయ పనులు తగ్గిపోవడం, స్థానికంగా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉండటం వలసలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. గ్రామంలో పని దొరకకపోతే కూలీ ఏం చేయాలి? కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి? పిల్లలకు తిండి ఎలా పెట్టాలి? అప్పులు ఎలా తీర్చాలి? ఈ ప్రశ్నలకు సమాధానం వెతుక్కుంటూ అనేక కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

మహారాష్ట్రలోని ముంబై, పుణె వంటి నగరాలకు వలస వెళ్లే కుటుంబాలు నిర్మాణ రంగంలో మట్టి పనులు, భవన నిర్మాణ పనులు, ఇతర రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాయి. సొంత ఊరిలో పొలం ఉన్నా సాగు చేయడానికి నీరు లేదు. సాగు చేసినా పంట చేతికొస్తుందన్న భరోసా లేదు. వ్యవసాయ కూలీగా పనిచేద్దామన్నా పనులు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో వలస వెళ్లడం వారికి ఇష్టపూర్వక ఎంపిక కంటే జీవనాధారం కోసం తీసుకోవాల్సిన నిర్ణయంగా మారుతోంది. వలస వెళ్లిన కుటుంబాలు ఎదుర్కొనే సమస్యలు కూడా అనేకం. నివాస సౌకర్యాల కొరత, అస్థిరమైన ఆదాయం, ఆరోగ్య సమస్యలు, పని ప్రదేశాల్లో భద్రత, పిల్లల విద్యకు ఆటంకం వంటి ఇబ్బందులు వారి జీవితాలను ప్రభావితం చేస్తాయి.

### తాగునీటి సంక్షోభం.. రాబోయే ఆరు నెలలపై ఆందోళన!

ప్రస్తుత పరిస్థితుల్లో మరో కీలకమైన ప్రశ్న తాగునీటి భద్రత. వర్షాలు తగినంతగా కురవకపోవడం, నీటి వనరుల్లో ఆశించిన స్థాయిలో నీరు నిల్వ కాకపోవడం వల్ల రానున్న నెలల్లో తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. వ్యవసాయానికి నీరు లేకపోవడం ఒక సమస్య అయితే, ప్రజలకు తాగడానికి నీరు అందకపోవడం అంతకంటే తీవ్రమైన సంక్షోభం. అయితే రాబోయే ఆరు నెలల్లో జిల్లావ్యాప్తంగా తాగునీటి కొరత ఏర్పడుతుందని ఇప్పుడే నిర్ధారించలేం. అందుకు గ్రామాల వారీగా నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి పథకాల సామర్థ్యం, రానున్న వాతావరణ పరిస్థితులను పరిశీలించాలి. ముందస్తు చర్యలు మాత్రం ఇప్పటి నుంచే ప్రారంభించాల్సిన అవసరం ఉంది. ఏ గ్రామంలో ఎంత నీరు ఉంది? ప్రస్తుతం ఎంత నీరు వినియోగిస్తున్నారు? వేసవి వరకు ఎంత నీరు అవసరమవుతుంది? ప్రత్యామ్నాయ నీటి వనరులు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానాలు సిద్ధం చేసుకోవాలి. అవసరమైన చోట నీటి వనరుల మరమ్మతులు చేపట్టాలి. తాగునీటి పథకాల్లో లోపాలను సరిచేయాలి. నీటి సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలి. ట్యాంకర్ల ద్వారా సరఫరా అవసరమయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా చూడటం అత్యంత ముఖ్యం. నీటి కొరత తీవ్రమైన తర్వాత స్పందించడం కంటే, సమస్య మొదలయ్యే ముందే చర్యలు తీసుకోవడం ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది.

# బతుకమ్మ.. మళ్లీ రావమ్మ!

**పేట కలెక్టరేట్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు**

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక: జిల్లా కలెక్టర్ ప్రియాంక**



నారాయణపేట అక్టోబర్ 18 (మనం న్యూస్) :

*తంగేడు పూవుల్ల చందమామ..*

*బతుకమ్మ పోతుంది చందమామ..*

*పోతెపోతివిగాని చందమామ..*

*మళ్లెప్పుడొస్తావు చందమామ..*

*ఏడాదికోసారి చందామామ..*

*నువ్వొచ్చి పోవమ్మ చందమామ..*

*వచ్చే ఏడు మళ్లీ రావాలంటూ తెలంగాణ ఆడ పడుచులు బతుకమ్మకు వీడ్కోలు పలికారు.*

*బతుకమ్మ మళ్లీ రావమ్మ!!*

*గౌరమ్మా.. మళ్లీ రావమ్మా...*

అంటూ మహిళలు బతుకమ్మలను సాగ నంపారు. తొమ్మిదిరోజుల పాటు వైభవంగా సాగిన పూలపండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మతో ముగిసింది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా పల్లెలు గ్రామాలలో ఘనంగా తొమ్మిది రోజులు బతుకమ్మ ఆటపాటలతో కోలా హలంగా మారింది. సొంతూళ్లకు చేరుకున్న ఆడపడుచులు చిన్నాపెద్దా తేడా లేకుండా పాటలు, ఆటలతో మైమరచి పోయారు. చివరి రోజు గౌరమ్మా రూపంలో కొలిచి, వీడ్కోలు పలికారు. మళ్లీ ఏడాది రావాలంటూ బతుకమ్మలను జలనిధికి చేర్చారు...పూల పండుగ బతుకమ్మ మహిళల ఐక్యతకు, ప్రకృతితో మానవ సంబంధానికి ప్రతిరూపం అని జిల్లా కలెక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ ఆవ-ణలో శనివారం సాయంత్రం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో కలెక్టరేట్ ప్రాంగణం పూలవనంలా కనువిందు చేసింది. మహిళలు సంప్రదాయ దు-స్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేయడంతో కలెక్టరేట్ ఆవరణ పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక, అదనపు కలెక్టర్ శ్రీను, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి రాజేందర్ గౌడ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి అనిల్ కుమార్, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు సామూహికంగా జరుపుకునే ఈ పండుగ మన సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సృజనాత్మకతకు బతుకమ్మ పండుగ అద్దం పడుతుందని తెలిపారు. బతుకమ్మ పండుగలో ప్రకృతికి, పూలకు ఇచ్చే ప్రాధాన్యత ఎంతో గొప్పదని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ రకాల పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చడం మన సంప్రదాయంలోని కళాత్మకతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ప్రకృతిలో లభించే పూలను పూజించడం ద్వారా పర్యావరణంపై గౌరవం, ప్రకృతి పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందుతాయని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పండుగ మన సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించే గొప్ప వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఆనందాన్ని, ఆత్మీయతను పంచుతుందని కలెక్టర్ అన్నారు. కుటుంబాలు, సమాజం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మహిళలు జరుపుకునే ఈ పండుగ లో సామూహిక భాగస్వామ్యం ప్రత్యేకతగా నిలుస్తుందని తెలిపారు. మహిళలు తమ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భావితరాలకు పరిచయం చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఉద్యోగుల మధ్య ఐక్యత, సౌహార్ద వాతావరణం మరింత బలోపేతం అవుతుంద ని కలెక్టర్ పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు మన పండుగలు, సంప్రదాయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం మనందరి బాధ్యత అని తెలిపారు. అనంతరం మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపిస్తూ, బతుకమ్మల చుట్టూ వలయాకారంలో తిరుగుతూ నృత్యాలు చేశారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల కోలాటాలు, పాటలతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఉద్యోగులు, మహిళా సిబ్బందిలో పండుగ ఉత్సాహాన్ని నింపాయి. సంప్రదాయాల పరిరక్షణ, మహిళల భాగస్వామ్యం, సాంస్కృతిక ఐక్యతకు ఈ వేడుకలు ప్రతీకగా నిలిచాయి.





## రంగస్థలానికి ప్రాణం పోసిన నటుడు శంకర్ గౌడ్

**-మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

వనపర్తి అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) : తన నటనతో ఐదు దశాబ్దాలుగా పాలమూరు రంగస్థలానికి ప్రాణం పోసిన గొప్ప కళాకారుడు పబ్బ శంకర్ గౌడ్ అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు, సీనియర్ నటుడు స్వర్గీయ పబ్బ శంకర్ గౌడ్ సంస్మరణ సభ ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ శంకర్ గౌడ్ ఐదు దశాబ్దాలకు పైగా పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘిక నాటకాల్లో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. ఆయన పోషించిన శ్రీకృష్ణుడు, దుర్యోధనుడు, బిల్వమంగళుడు, భారత వీరుడు వంటి పాత్రలు ఆయనకు ఎనలేని గుర్తింపు తెచ్చాయి. సినిమా రంగంలో శిక్షణ తీసుకుని పలు సినిమాలు, టీవీ సీరియల్స్ లోనూ నటించారు. ఎన్నో పురస్కారాలు, అవార్డులు అందుకున్న ఆయన మరణం నాటక రంగానికి తీరని లోటని నివాళులు అర్పించారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, ప్రముఖ న్యాయవాది మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నటుడిగానే కాకుండా తోటి కళాకారులను ప్రోత్సహిస్తూ వర్ధమాన కళాకారులకు స్ఫూర్తిగా నిలిచారు. పేద కళాకారుల కోసం, పలు పాఠశాలల, కళా సంస్థల సహాయార్థం ఎన్నో నాటక ప్రదర్శనలు ఇచ్చారని కొనియాడారు. ఈ సభలో ప్రముఖ రంగస్థల కళాకారులు వి. నారాయణ, భాగన్న గౌడ్, దుప్పల్లి శ్రీరాములు, వెంకటేశ్వర్‌రావు పాల్గొని పద్యాలు, పాటలతో శంకర్ గౌడ్ కు ఘనంగా నివాళులు అర్పించారు.



## ప్రజల హృదయాల్లో నేటికీ నిలిచిన కొత్త వెంకటేశ్వరరావు సేవలు

కొల్లాపూర్, అక్టోబర్ 19 (మనం న్యూస్) : ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొల్లాపూర్ శాసనసభ్యులుగా మూడుసార్లు ఎన్నికైన కొత్త వెంకటేశ్వరరావు 24వ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఇందిరాగాంధీ అభిమాన సంఘం అధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు రంగినేని జగదీశ్వరుడు మాట్లాడుతూ.. కొత్త వెంకటేశ్వరరావు నీతి, నిజాయితీలకు నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. నిరాడంబరతకు మారుపేరుగా, నిస్వార్థ ప్రజాసేవకుడిగా ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. క్యాబినెట్ హోదా కలిగిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన ఆయన, ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని జగదీశ్వరుడు గుర్తుచేశారు. కొల్లాపూర్ ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న సమయంలో నెదర్లాండ్స్ సహకారంతో ఎత్తిపోతల పథకాల ద్వారా సోమశిల నుంచి తాగునీటిని అందించేందుకు కృషి చేశారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ఎన్నో ప్రణాళికలు రూపొందించి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన చేసిన సేవలు నేటికీ ప్రజల మనసుల్లో చెరగని ముద్రగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్ రావు, రవి ముదిరాజ్, రజక స్వామి తదితరులు పాల్గొన్నారు. వర్ధంతి సందర్భంగా పేదలకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్త వెంకటేశ్వరరావుకు ఘన నివాళులర్పించారు.



# మోదీ ప్రభుత్వంతోనే గ్రామీణ అభివృద్ధి సాధ్యం

## రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా : ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

మహ్మదాబాద్, అక్టోబర్ 18, మనం న్యూస్ : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మహ్మదాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎంపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, తాగునీటి బోర్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మహ్మదాబాద్ మండల గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎంపీలు అరుదుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, ప్రజలకు మోదీ ప్రతినిధిగా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, మురుగునీటి పారుదల వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత అభివృద్ధికి అవసరమైన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీ పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, గ్రామాల అవసరాలను గుర్తించి దశలవారీగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యు. రమేష్, మండల అధ్యక్షుడు మూస నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్ నాయక్, రాష్ట్ర నాయకులు గిరముని శ్రీనివాసులు, ఏవీ రాములు, వెన్న ఈశ్వరప్ప, జిల్లా నాయకుడు కురవ కృష్ణ, సర్పంచులు రామకృష్ణ, గోపాల్, మండల జీఎస్ కాశీనాథ్ పవన్ కుమార్, బీజేపీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, యాదయ్య, ప్రభు నాయక్ పాల్గొన్నారు.



# వ్యాపారంలో కృషి, ఓర్పు ముఖ్యం

## ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెద్దమందడి, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) : వ్యాపార రంగంలో రాణించేందుకు కృషి, ఓర్పు ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మండలంలోని జగత్ పల్లిలో లక్ష్మారెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్ మిల్లును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేసే పనిని దైవంగా భావించి నిబద్ధతతో పనిచేస్తే విజయం సాధించవచ్చన్నారు. స్థానికంగా పరిశ్రమలు రావడం వల్ల ఉపాధి పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. నిర్వాహకుడు లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దొడ్ల డెయిరీ పాలలో డిటర్జెంట్, కాస్టిక్ సోడా

## వినియోగానికి పనికిరాదన్న ఫుడ్ ల్యాబ్




వనపర్తి అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) : తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా అమ్ముడవుతున్న దొడ్ల డెయిరీ పాలలో కల్తీ వెలుగు చూసింది. దొడ్ల ఫుల్ క్రీమ్ పాల నమూనాల్లో డిటర్జెంట్, కాస్టిక్ సోడా అవశేషాలు ఉన్నట్లు జాతీయ ఆహార భద్రత, ప్రమాణాల నియంత్రణ మండలి (FSSAI) ప్రకటించింది. కంపెనీ ప్లాంట్ నుంచి సేకరించిన పాల నమూనాలను విశ్లేషణకు పంపగా, ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో ఫుడ్ అనలిస్ట్ నాసిరకంగా ధ్రువీకరించారు. కంపెనీ అప్పీల్ చేయడంతో రిఫరల్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించగా, అక్కడ కూడా డిటర్జెంట్, కాస్టిక్ సోడా ఉందని, నిర్ణీత పరిమితి కంటే తక్కువ మిల్క్ ఫ్యాట్ ఉందని, ఇది మానవ వినియోగానికి పనికిరాదని నివేదిక వచ్చింది. అలాగే ప్రియా గోల్డ్ బిస్కెట్లలో పశువుల దాణా కోసం వాడే తవుడును వినియోగించినట్లు తేలింది. వినియోగదారుడి ఫిర్యాదుతో సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో సంస్థ తయారీ కేంద్రంపై FSSAI బృందం తనిఖీ చేయగా, ఆ గోనె సంచులపై 'పశువుల దాణా' అని రాసి ఉండటాన్ని గుర్తించింది. దీంతో ఆ సంస్థ లైసెన్స్‌ను సస్పెండ్ చేసి ప్రాసిక్యూషన్ చర్యలు ప్రారంభించింది. మరోవైపు యూఆర్‌ఆర్ ఆర్గానిక్ ఫుడ్స్ ఎల్లో రైజిన్స్ (ఎండుద్రాక్ష/కిస్మిస్)లో పురుగు మందు అవశేషాలు ఉన్నట్లు బయటపడటంతో ఆ సంస్థపైనా చట్టపరమైన చర్యలు చేపట్టింది. మూడు సంస్థలపైనా FSSAI చర్యలు ప్రారంభించింది.






# దుప్పల్లిలో కదిలించిన గౌడ సంఘం మానవత్వం

## మహదేవన్ గౌడ్ సతీమణి అనసూయమ్మకు అండగా 1,17,400 ఆర్థిక భరోసా



వనపర్తి అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) : మృత్యువు ఒక కుటుంబంలోని పెద్ద దిక్కును లాగేసుకుంటే, మిగిలిన కుటుంబం వీధిన పడకుండా చేయి పట్టుకుని నడిపించడమే నిజమైన బంధుత్వం. ఆ బంధుత్వాన్ని వనపర్తి జిల్లా గౌడ సంఘం చూపించింది. మదనాపురం మండలం దుప్పల్లి గ్రామానికి చెందిన మహదేవన్ గౌడ్ ఇటీవల అకాల మరణం చెందారు. భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆయన సతీమణి అనసూయమ్మను ఆదుకోవడానికి జిల్లా గౌడ సంఘం ముందుకు వచ్చింది. ఆదివారం దుప్పల్లి గ్రామంలో జరిగిన దశదినకర్మకు వనపర్తి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు, మణిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో జిల్లా నాయకులు, అన్ని మండలాల గౌడ సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ. 1,17,400 నగదును ఆర్థిక సాయంగా అందజేసి మానవతా స్పృహ చాటుకున్నారు. ఇది కేవలం డబ్బు కాదు.. మీకు మేమున్నాం అనే ధైర్యం. కల్లు గీసే చేతులు కష్టాన్ని నమ్ముకుంటాయి, కానీ కన్నీరు చూస్తే కరిగిపోతాయి. మా గౌడ సోదరుడు లేని లోటును భర్తీ చేయలేం, కానీ ఆ కుటుంబం ఒంటరిది కాదని చెప్పడానికి ఈ చిన్న ప్రయత్నం చేశాం. ఇది మా జాతి ఐక్యతకు నిదర్శనం అని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కుల సంఘం అంటే కేవలం సమావేశాలు కాదు, కష్టంలో తోడుండటమని వనపర్తి జిల్లా గౌడ సంఘం నిరూపించిందని గ్రామస్తులు కొనియాడుతున్నారు. ఈ మహత్తర కార్యానికి సహకరించిన ప్రతి మండల గౌడ సంఘం నాయకులకు, జిల్లా కమిటీ సభ్యులకు, దాతలకు జిల్లా గౌడ సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.



# సాయుధ దళ కార్యాలయంలో ఆయుధ పూజ

**పోలీసు సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ సునీత రెడ్డి**

వనపర్తి అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) : చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక అయిన విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా సాయుధ పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని సాయుధ దళ కార్యాలయంలో ఆదివారం ఉదయం జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా ఆయుధ పూజ నిర్వహించారు. శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛరణల మధ్య పోలీసులు వినియోగించే ఆయుధాలు, మందుగుండు సామగ్రికి, అనంతరం శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా ఉపయోగించే పోలీసు వాహనాలకు పూజలు చేశారు. అనంతరం రాజపేట శివారులోని పోలీసు పెట్రోల్ బంక్ లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ దసరా పండుగలో ఆయుధ పూజకు ఉన్న ప్రాధాన్యతే వేరు. ఇది కేవలం పూజ మాత్రమే కాదు, ఒక కృతజ్ఞత. 365 రోజులు ప్రజా రక్షణలో మన వెన్నంటే ఉండి, శత్రువు నుంచి, సంఘ విద్రోహ శక్తుల నుంచి మనల్ని, ప్రజల్ని కాపాడే ఆయుధానికి మనం ఇచ్చే గౌరవం. ఆయుధం చేతిలో ఉన్నప్పుడు అది అహంకారం కాకూడదు, బాధ్యతగా ఉండాలి. ఆ బాధ్యతను గుర్తు చేసేదే ఈ ఆయుధ పూజ. ప్రతి ఆయుధం రాజ్య రక్షణకు, ప్రజా శాంతికి ప్రతీక అని ఉద్వేగంగా ప్రసంగించారు. దుర్గామాత దీవెనలతో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలు నెలకొనాలని, పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు ఆయురారోగ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ముందస్తుగా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు అని, ప్రతి సిబ్బంది విధి నిర్వహణలో మరింత అప్రమత్తతతో, అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ గిరిబాబు, సీఐలు ఓడీ రమేష్, సుగంధ రత్నం, నరేష్, ఆర్ఐలు అప్పలనాయుడు, శ్రీనివాస్ కుమార్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.







# బుద్ధారం పెద్ద చెరువు నిర్వాసితులకు న్యాయం చేయండి

**ఎమ్మెల్యేకు సీపీఎం వినతి**

గోపాల్పేట అక్టోబర్ 19 (మనం న్యూస్) : బుద్ధారం పెద్ద చెరువు భూ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం మార్కెట్ రేటుకు మూడింతలు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఆదివారం సీపీఎం నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ జబ్బార్ ఆధ్వర్యంలో 8 డిమాండ్లపై ఎమ్మెల్యేతో చర్చించారు. మార్కెట్ వాల్యూ రూ.15.75 లక్షలు ఉంటే, చట్ట ప్రకారం మూడింతలు అంటే రూ.47.25 లక్షలు ఇవ్వాలని, కేవలం రూ.15 లక్షలు ఇవ్వడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్ లిఫ్ట్ లో మార్కెట్ వాల్యూ రూ.2.25 లక్షలు ఉంటేనే జీవో 333 తెచ్చి రూ.20 లక్షలు ఇచ్చారని, ఇక్కడ సారవంతమైన భూములకు రూ.47.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోర్లు, బావులు, పైపులైన్లు, మామిడి, కొబ్బరి, టేకు, నేరేడు తోటలు, ట్రాన్స్ ఫార్మర్లకు అదనపు పరిహారం, 18 ఏళ్లు నిండిన నిర్వాసిత యువకులకు ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. సర్వే నం.176,177,178,204లలో రికార్డులో ఉన్న వారికి కాకుండా అనుభవదారులకే పరిహారం ఇవ్వాలన్నారు. ప్రత్యేక జీవో తేవకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పందిస్తూ.. ప్రస్తుతం రూ.15 లక్షలు ఇస్తున్నామని, పెంచేందుకు మరోసారి చర్చించి ప్రయత్నం చేస్తామని, ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు మధు, కృష్ణ, శేఖర్, సింహయ్య, సాంబయ్య, ధర్మారావు, కావలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల బస్సు పాసులను హైదరాబాద్ వరకు విస్తరించాలి

**బ్రహ్మగిరి, మన్ననూర్ ప్రెస్ సెంటర్లలో అర్హులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి**

**ప్రెస్ కౌన్సిల్‌లో యూనియన్‌కు ముగ్గురికి అవకాశం రావడం గర్వకారణం: మారుతి సాగర్**



అచ్చంపేట, అక్టోబర్ 18 (మనం న్యూస్): రాష్ట్రంలోని జర్నలిస్టుల ఆరోగ్య కార్డులను పునరుద్ధరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల పరిధిలో కొనసాగుతున్న జర్నలిస్టుల బస్సు పాసులను హైదరాబాద్ వరకు విస్తరించాలని టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని బ్రహ్మగిరి, మన్ననూర్ ప్రెస్ సెంటర్లలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం మన్ననూర్‌లో స్థానిక జర్నలిస్టులతో సమావేశమైన మారుతి సాగర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు చందునాయక్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రావూఫ్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే హెచ్--143 నిరంతరం పోరాడుతోందని మారుతి సాగర్ తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ఉద్యమాలు చేపడుతూ వారికి యూనియన్ అండగా నిలుస్తోందన్నారు. ప్రెస్ కౌన్సిల్‌లో తమ యూనియన్‌కు అనుబంధంగా ఉన్న ఐజేయూ నుంచి ముగ్గురికి అవకాశం లభించడం గర్వకారణమన్నారు.

**హైదరాబాద్ వరకు బస్సు పాసులు**

ప్రస్తుతం జర్నలిస్టులకు ఉమ్మడి జిల్లాల పరిధిలో కొనసాగుతున్న బస్సు పాసులను హైదరాబాద్ వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని మారుతి సాగర్ అన్నారు. గ్రామీణ ప్రాంత జర్నలిస్టులు అధికారిక సమావేశాలు, విధుల నిర్వహణ, వైద్య అవసరాల కోసం రాజధానికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. బస్సు పాసుల పరిధిని హైదరాబాద్ వరకు పెంచితే జర్నలిస్టులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలుగుతుందన్నారు. ఈ సమస్యను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలి**

అమ్రాబాద్ మండలంలోని బ్రహ్మగిరి, మన్ననూర్ సెంటర్లలో గతంలో అక్రిడిటేషన్లు కొనసాగాయని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త జీవో ప్రకారం కొన్ని పత్రికలకు అక్రిడిటేషన్లు మంజూరైనప్పటికీ, అర్హత ఉండి పనిచేస్తున్న మరో ముగ్గురు జర్నలిస్టులకు కార్డులు అందకపోవడం అన్యాయమని అన్నారు. ఈ రెండు సెంటర్లలో అర్హులైన ముగ్గురు జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసేలా సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రిడిటేషన్లు అందని అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు మంజూరయ్యే వరకు యూనియన్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి**

మండల కేంద్రాలు, పట్టణాల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మారుతి సాగర్ డిమాండ్ చేశారు. ఏ ఒక్క జర్నలిస్టుకు అన్యాయం జరగకుండా యూనియన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన జర్నలిస్టు సంఘంగా అదే స్ఫూర్తితో జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నామని, ఆ క్రమంలో అనేక సమస్యలను పరిష్కరించుకోగలిగామని వివరించారు. నల్లమల ప్రాంతంతో తనకు ఎంతో అనుబంధం ఉందని పేర్కొన్న మారుతి సాగర్, జిల్లాలో యూనియన్ సభ్యత్వాల నమోదును ఈ నెలాఖరులోగా పూర్తి చేసి రాష్ట్ర కమిటీకి పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక జర్నలిస్టు యూనియన్ నాయకులు ప్రకాష్, కర్నాటి శ్రీనివాసులు, బుచ్చయ్య, వేదాంతం, బిచ్చా, సైదులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు కరెంటు, సాగునీటి సమస్యలు పరిష్కరించాలి

### మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి

వనపర్తి అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) : రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కరెంటు, సాగునీటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుత కరువు పరిస్థితులు కాలం తెచ్చినది కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వచ్చిందని ఆరోపించారు. ఆదివారం మండల పరిధిలోని బండపల్లి గ్రామంలో దుర్గామాత దర్శనం అనంతరం, పానగల్ మండల కేంద్రంలోని డీ8 కాల్వ ఎంజే3 సమీపంలో కరెంటు లేక ఎండిపోయిన వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు ఇవ్వలేకపోయినా, కనీసం కరెంటు అయినా సరిగ్గా ఇస్తే పంటలు దక్కేవన్నారు. చేతికొచ్చిన పంట ఎండిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ను తిట్టడం తప్ప ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. అంతకుముందు కేతేపల్లి, పానగల్, మాధవరావుపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్, నాయకులు వెంకటయ్య నాయుడు, రవికుమార్, సుదర్శన్ నాయుడు, సర్పంచులు కిషోర్ నాయక్, రొద్ద కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## వట్వర్లపల్లి గ్రామ పునరావాస ప్రక్రియలో కీలక ముందడుగు

### స్వచ్ఛందంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసిన 240 మంది గ్రామస్థులు

అచ్చంపేట, అక్టోబర్ 18 (మనం న్యూస్): అమ్రాబాద్ పులుల అభయారణ్యం పరిధిలోని వట్వర్లపల్లి గ్రామంలో స్వచ్ఛంద గ్రామ పునరావాస ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. పునరావాస ప్రక్రియలో భాగంగా తుది దశలో నిర్వహించే ఒప్పంద పత్రాలపై సంతకాల కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మొత్తం 240 మంది సభ్యులు స్వచ్ఛందంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అటవీ శాఖ జిల్లా అధికారి రేవంత్ చంద్ర, అటవీ విభాగ అధికారి యశ్ చంద్రప్రకాశ్ సింగ్ హాజరయ్యారు. అలాగే మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామన్న, అటవీ క్షేత్ర అధికారులు వీరేష్, ఈశ్వర్, పోలీసు వలయ అధికారి నాగరాజు, పోలీసు ఉప పరిశీలకుడు జయన్న, హనుమంతు రెడ్డి, పునరావాస కమిటీ అధ్యక్షుడు సాయి ఆరవ్ అపిషు, ఉప సర్పంచ్ బండ బాలరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయిరామ్‌తో పాటు సంబంధిత విభాగాల అధికారులు, అటవీ క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా పునరావాస కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ జూయా నాయక్‌తో పాటు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ ప్రజల స్వచ్ఛంద నిర్ణయాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పునరావాస ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో ఈ కార్యక్రమం కీలక ఘట్టంగా నిలిచింది. గ్రామస్థుల భాగస్వామ్యంతో పునరావాస ప్రక్రియలో మరో ముఖ్యమైన దశ పూర్తయింది.



## మర్రికుంట శాంతన్న బంతిపూల సాగు ఆదర్శనీయం

### బంతిపూలతో బంగారం పండిస్తున్న రైతు శాంతన్నకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అభినందన



వనపర్తి, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) : సీజన్ ను పసిగట్టి, మార్కెట్ డిమాండ్ కు తగ్గట్టు సాగు చేస్తే రైతు ఎప్పుడూ నష్టపోడని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. దసరా, దీపావళి పండుగల వేళ డిమాండ్ కు అనుగుణంగా శాంతన్న సాగు చేసిన బంతిపూల తోట ఏపుగా పెరిగి, పూల దిగుబడితో కళకళలాడుతోంది. ఈ తోటను ఆదివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తోటను సందర్శించి పూల దిగుబడిని స్వయంగా పరిశీలించి రైతు శాంతన్నకు శాలువా కప్పి మనస్ఫూర్తిగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు కేవలం వరి, పత్తి అనే కాకుండా సీజనల్ పంటలపై దృష్టి పెట్టాలని దసరా, దీపావళికి బంతిపూలకు విపరీతమైన డిమాండ్ ఉంటుందన్నారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం కంటే మన ప్రాంత రైతులే పండిస్తే స్థానికంగా తాజా పూలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని రైతుకు మంచి లాభం చేకూరుతుందని చెప్పారు. శాంతన్న సాగుచేసే బంతిపూల సాగు అందరికీ ఆదర్శమని ప్రశంసించారు. అంతేకాదు, రైతును ప్రోత్సహిస్తూ తన దసరా, దీపావళి పండుగ అవసరాలకు కావాల్సిన బంతిపూలను శాంతన్న తోట నుంచే కొనుగోలు చేస్తానని స్వయంగా ఆర్డర్ ఇచ్చి రైతుకు అండగా నిలిచారు. కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి, మాధవరెడ్డి, సునీల్ వాల్మీకి, చిట్యాల రాము, మంద రాము, ఎండీ అలీం, ముద్దా సిర్, జమీల్, చీర్ల శ్రీనివాసులు, బెదారి కుమార్, శంకర్ నాయక్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాష్టమి వేళ.. దుర్గాదేవిగా దర్శనమిచ్చిన జగన్మాత

### ఉప్పునుంతల మండలంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

### ఆలయాలు, పూజా మండపాల్లో భక్తుల రద్దీ.. ప్రత్యేక పూజలు, అన్నదానాలు



ఉప్పునుంతల, అక్టోబర్ 18 (మనం న్యూస్) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన ఆదివారం ఉప్పునుంతల మండలవ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. దుర్గాష్టమి పురస్కరించుకుని ఆ జగన్మాత భక్తులకు శ్రీ దుర్గాదేవి రూపంలో దివ్య దర్శనమిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన నవరాత్రి మండపాలు భక్తుల రాకతో కిటకిటలాడాయి. మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీ శివాలయంలో అమ్మవారికి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, విశేష హారతులు నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే స్థానిక కోట బురుజు వద్ద 'నవదుర్గా యూత్ అసోసియేషన్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారికి విశేష అర్చనలు, అభిషేకాలు జరిగాయి. పూజా కార్యక్రమాల అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలలో వెలసిన దేవీ మండపాలలోనూ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ చేపట్టారు.

## తాగునీటి సరఫరాకు అంతరాయం

### సమస్యను పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి

ఉప్పునుంతల, అక్టోబర్ 18 (మనం న్యూస్) : మండల కేంద్రమైన ఉప్పునుంతలలో గత మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దసరా పండుగ సందర్భంగా బంధుమిత్రులు, స్వస్థలాలకు వచ్చేవారితో గ్రామం సందడిగా మారిన వేళ తాగునీరు అందుబాటులో లేకపోవడంతో నిత్యావసరాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీటి సరఫరాలో ఏర్పడుతున్న సాంకేతిక లోపాలు, వేళాపాళా లేకపోవడంపై స్థానికులు పంచాయతీ అధికారులను సంప్రదిస్తున్నారు. మండల కేంద్రంలోనే సరఫరాకు అంతరాయం కలగడంతో పరిసర గ్రామాల ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. పండుగ వేళ ప్రజలు ఎదుర్కొంటున్న దాహార్తిని దృష్టిలో ఉంచుకుని, సంబంధిత మిషన్ భగీరథ ఉన్నతాధికారులు త్వరితగతిన స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. సరఫరాలో తలెత్తిన సమస్యలను తక్షణమే సరిదిద్ది, క్రమం తప్పకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొల్లాపూర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

### మహిళలతో కలిసి సంబరాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

కొల్లాపూర్, అక్టోబర్ 19 (మనం న్యూస్) : కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో సద్దుల బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ రెడ్డి జ్యోతి సత్యం, వైస్ చైర్మన్ షేక్ రహీం పాషా, స్థానిక కౌన్సిలర్లు పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతిరూపమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో నిర్వహించే ఈ వేడుకలు తెలంగాణ ఆడబిడ్డల జీవన విధానాన్ని, సంస్కృతీ వైభవాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు వంగ అనూష రాజశేఖర్ గౌడ్, బోరెల్లి మహేష్, జోష్న మహేష్, పసుపుల సుజాత, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇక్బాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# జడ్చర్లలో దసరా ఉత్సవాలు ఘనంగా ఏర్పాట్లు!

**రావణ దహనానికి కౌంట్‌డౌన్..**

**పండుగ సంబరాలకు పట్టణం ముస్తాబు!**

**జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో కనివిని ఎరుగని రీతిలో దసరా వేడుకలు**

**చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా రావణ దహనం!**

పాలమూరు, అక్టోబర్ 18 (మనం న్యూస్) : దసరా అంటే కేవలం ఒక పండుగ కాదు.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక! అధర్మంపై ధర్మం సాధించిన గెలుపునకు నిదర్శనం! శ్రీరాముడి విజయగాథను గుర్తుచేసుకుంటూ, రావణ దహనంతో చెడును అంతం చేయాలనే సందేశాన్ని చాటిచెప్పే మహోన్నత వేడుక! అలాంటి విజయదశమి పండుగను మరింత వైభవంగా, ప్రజలందరికీ చిరస్మరణీయంగా నిర్వహించేందుకు జడ్చర్ల పట్టణం సిద్ధమవుతోంది. రావణ దహనానికి కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో పట్టణంలో పండుగ సందడి నెలకొంది. జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టడంతో స్థానికుల్లో ఆసక్తి నెలకొంది. పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చేలా కార్యక్రమాలను నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నద్ధమవుతున్నారు.

**దసరా వేడుకల్లో జడ్చర్ల స్పెషల్ అట్రాక్షన్!**

దసరా వచ్చిందంటే పల్లెల నుంచి పట్టణాల వరకు ఎక్కడ చూసినా సందడే! కొత్త బట్టలతో చిన్నారుల కేరింతలు.. కుటుంబ సభ్యుల కలయికతో ఇళ్లలో ఆనందం.. ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. విజయదశమి శుభాకాంక్షలతో స్నేహితులు, బంధువుల ఆత్మీయ పలకరింపులు.. ఇలా ప్రతి ఇంటా పండుగ వెలుగులు విరజిమ్ముతాయి. అయితే ఈసారి జడ్చర్లలో దసరా వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా రావణ దహనం నిలవనుంది. పండుగను కేవలం ఆచారంగా కాకుండా ప్రజలందరినీ ఒకచోట చేర్చే సామూహిక సంబరంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రజలు, యువత, కుటుంబాలు కలిసి పండుగ ఆనందాన్ని పంచుకునేలా కార్యక్రమం ప్రత్యేకతను సంతరించుకోనుంది.



**జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు!**

జడ్చర్లలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించాలనే లక్ష్యంతో జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపడుతున్నారు. పండుగను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయడం, జడ్చర్ల పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం వంటి అంశాలు ఈ వేడుకల ప్రాధాన్యతను పెంచుతున్నాయి. పండుగ అంటే ప్రజల మధ్య అనుబంధాలను బలోపేతం చేసే వేదిక. రాజకీయాలు, కులమత భేదాలు, వ్యక్తిగత విభేదాలకు అతీతంగా అందరూ కలిసి ఆనందాన్ని పంచుకునే సందర్భం. అలాంటి పండుగలో ప్రజలంతా భాగస్వాములు కావడం ద్వారా సామాజిక ఐక్యత మరింత బలపడుతుందనే సందేశం దసరా వేడుకల్లో అంతర్లీనంగా కనిపిస్తోంది.

**రావణ దహనం.. చెడుకు చరమగీతం!**

రావణ దహనం అనేది కేవలం ఒక ప్రతిమను దహనం చేయడం కాదు. మనిషిలోని అహంకారం, అధర్మం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి చెడు లక్షణాలకు ముగింపు పలకాలనే సందేశం! రామాయణంలో రావణుడు ఎంతటి శక్తిమంతుడైనా, అతడి అహంకారం చివరకు పతనానికి దారితీసింది. ధర్మం కోసం నిలబడిన శ్రీరాముడు విజయాన్ని సాధించాడు. అందుకే ప్రతి విజయదశమి మనకు ఒక గొప్ప పాఠాన్ని గుర్తుచేస్తుంది. అధికారం శాశ్వతం కాదు.. అహంకారం విజయానికి మార్గం కాదు.. చివరికి నిలిచేది ధర్మం, న్యాయం, మంచితనమే! జడ్చర్లలో జరగనున్న రావణ దహనం కూడా ఈ విజయదశమి సందేశాన్ని ప్రజలకు గుర్తుచేసే సందర్భంగా నిలవనుంది. చెడును విడిచిపెట్టి మంచిని ఆచరించాలనే సంకల్పంతో ప్రజలు పండుగను జరుపుకోవాలని ఈ వేడుకలు చాటిచెప్పనున్నాయి.

**పిల్లల కేరింతలు.. పెద్దల ఆనందం.. యువతలో ఉత్సాహం!**

పండుగ వేడుకల్లో అసలైన ఆనందం చిన్నారుల ముఖాల్లో కనిపించే చిరునవ్వుల్లోనే ఉంటుంది. రావణ దహనం చూడాలనే ఆసక్తి.. కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొనాలనే ఉత్సాహం.. స్నేహితులతో పండుగ సంబరాలను పంచుకోవాలనే ఆతృత.. ఇవన్నీ దసరా పండుగకు మరింత అందాన్ని తీసుకొస్తాయి. జడ్చర్లలో నిర్వహించనున్న వేడుకలు కూడా పట్టణ ప్రజలకు ఆనందాన్ని పంచేలా నిలవాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకుంటూ కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొనాలని భావిస్తున్నారు.



**దసరా సందేశం ఒక్కటే.. ధర్మమే అంతిమ విజయం!**

నేటి సమాజంలో రావణ దహనానికి మరింత ప్రాధాన్యత ఉంది. ఎందుకంటే రావణుడు కేవలం రామాయణంలోని పాత్ర మాత్రమే కాదు.. మనిషిలోని అహంకారానికి, అన్యాయానికి, అధికార దుర్వినియోగానికి ప్రతీకగా కూడా భావించవచ్చు. ఎక్కడ అన్యాయం జరిగినా దాన్ని ప్రశ్నించే ధైర్యం ఉండాలి. ఎక్కడ బలహీనులపై దౌర్జన్యం జరిగినా వారికి అండగా నిలవాలి. ఎక్కడ అసత్యం రాజ్యమేలినా సత్యం కోసం పోరాడాలి. ఇదే విజయదశమి ఇచ్చే అసలైన సందేశం! జడ్చర్లలో దసరా వేడుకలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, ప్రజల్లో ఐక్యతను పెంపొందించేలా, ధర్మం పట్ల నిబద్ధతను చాటేలా నిలవాలని ఆశిద్దాం.

**జడ్చర్ల దసరా.. సంబరాలకు ప్రత్యేక చిరునామా!**

రావణ దహనానికి సిద్ధమవుతున్న జడ్చర్లలో పండుగ సందడి మరింత పెరగనుంది. జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేడుకలు ప్రజల భాగస్వామ్యంతో విజయవంతమై, పట్టణ ప్రజలకు మధుర జ్ఞాపకాలుగా మిగలాలని స్థానికులు కోరుకుంటున్నారు. చెడుపై మంచి గెలవాలి.. అధర్మంపై ధర్మం విజయం సాధించాలి.. ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి.. ప్రతి కుటుంబంలో సుఖ సంతోషాలు నిండాలి!

# అచ్చంపేటలో ఘనంగా నల్లమల మహా బతుకమ్మ-2026 వేడుకలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిన పూల పండుగ**

**బతుకమ్మకు పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దంపతులు**

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు.. పూల పండుగతో పులకించిన అచ్చంపేట**

అచ్చంపేట, అక్టోబర్ 18 (మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అచ్చంపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నల్లమల ప్రాంత ప్రత్యేకతను చాటుతూ అచ్చంపేట పట్టణంలోని ఐ లవ్ అచ్చంపేట పార్కు వద్ద నిర్వహించిన నల్లమల మహా బతుకమ్మ--2026 వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో వేడుకల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దంపతులు హాజరై బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు.

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై



ప్రేమకు, పూల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి సంవత్సరం మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సంబరాలు చేసుకోవడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, వారసత్వ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో అచ్చంపేటలో నిర్వహించిన నల్లమల మహా బతుకమ్మ-2026 వేడుకలు మహిళల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూల పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి, అందంగా అలంకరించిన బతుకమ్మలతో మహిళలు ఉత్సవాలకు తరలిరావడంతో పార్కు పరిసరాలు సందడిగా మారాయి.

**మహిళల భాగస్వామ్యంతో పండుగకు ప్రత్యేక శోభ**

నల్లమల మహా బతుకమ్మ వేడుకలను మహిళలందరి భాగస్వామ్యంతో నిర్వహించడం విశేషంగా నిలిచింది. బతుకమ్మ పాటలు, ఆటపాటలు, సంప్రదాయ వేడుకలతో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, మహిళల ఐక్యతను చాటిచెప్పేలా ఈ వేడుకలు కొనసాగాయి. పూల పండుగలో పాల్గొన్న మహిళలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మహిళలందరూ ఈ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాకుండా తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని పేర్కొన్నారు.

**నల్లమల వైభవాన్ని చాటిన మహా బతుకమ్మ**

నల్లమల ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి అందాలను ప్రతిబింబించేలా నిర్వహించిన నల్లమల మహా బతుకమ్మ--2026 వేడుకలు అచ్చంపేట పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుతూ, పూల పండుగను అందరూ కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందించేందుకు ఇలాంటి సామూహిక వేడుకలు దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.



# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

**ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

**లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**



అచ్చంపేట, అక్టోబర్ 18 (మనం న్యూస్): పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అర్హులైన కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

**పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు ఆర్థికంగా భారంగా మారకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం అందించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



**అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# అచ్చంపేటకు విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయం మంజూరు

**ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగుల అభినందనలు**

అచ్చంపేట, అక్టోబర్ 18 (మనం న్యూస్): అచ్చంపేట పట్టణానికి విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయం మంజూరు కావడంతో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి, విద్యుత్ శాఖ పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేసేందుకు డివిజనల్ కార్యాలయం మంజూరు చేయించడంలో కృషి చేసిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

**విద్యుత్ సేవలు మరింత చేరువ**

అచ్చంపేట పట్టణంలో విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయం ఏర్పాటు కావడం నియోజకవర్గ అభివృద్ధిలో కీలక పరిణామమని విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు పేర్కొన్నారు. ఈ కార్యాలయం అందుబాటులోకి రావడం ద్వారా విద్యుత్ శాఖకు సంబంధించిన పరిపాలనా కార్యకలాపాలు మరింత సులభతరం కావడంతో పాటు, విద్యుత్ సరఫరా సమస్యలు, కొత్త కనెక్షన్లు, ఇతర సేవలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో ప్రజలకు సౌలభ్యం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**నియోజకవర్గ అభివృద్ధికి మరో ముందడుగు**

అచ్చంపేట నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి అంశాల్లో విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయం కీలకంగా నిలవనుందని అధికారులు తెలిపారు. ఈ కార్యాలయం ఏర్పాటుతో విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ, పరిపాలనా సమన్వయం మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డివిజనల్ అధికారులు, వివిధ స్థాయిల ఉద్యోగులు పాల్గొన్నారు.

# అమరుడు కామ్రేడ్ చందు స్మారక స్థూపం పోరాట స్ఫూర్తికి ప్రతీక

**ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకం**

**స్మారక స్థూపాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**



అచ్చంపేట, అక్టోబర్ 18 (మనం న్యూస్): ప్రజల హక్కుల సాధన, సామాజిక న్యాయం, సమానత్వ సమాజ నిర్మాణం కోసం పోరాడిన అమరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బల్మూర్ మండలం నర్సాయిపల్లి గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు అమరుడు కామ్రేడ్ చందు స్మారక స్థూపం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, స్థూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరుడు కామ్రేడ్ చందు స్మృతికి నివాళులర్పించారు.

**ప్రజా పోరాటాలకు నిలువెత్తు నిదర్శనం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం, అణగారిన వర్గాలకు న్యాయం జరగాలని, సమాజంలో సమానత్వం నెలకొనాలని జీవితాలను అంకితం చేసిన నాయకుల త్యాగాలను ఎప్పటికీ మరచిపోకూడదన్నారు. అమరుడు కామ్రేడ్ చందు ప్రజల కోసం సాగించిన పోరాటం, సామాజిక న్యాయం పట్ల ఆయనకున్న నిబద్ధత, సమానత్వ సమాజ నిర్మాణం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన నాయకుల ఆశయాలను భావితరాలకు అందించడం సమాజ బాధ్యత అని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం నిస్వార్థంగా పోరాడిన నాయకుల జీవితాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, వారు ఆశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**స్మారక స్థూపాలు చరిత్రకు ప్రతీకలు**

స్మారక స్థూపాలు కేవలం రాతి నిర్మాణాలు మాత్రమే కావని, అవి ప్రజా ఉద్యమాల చరిత్రకు, పోరాటాలకు, అమరుల త్యాగాలకు ప్రతీకలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను తొలగించి, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలనే ఆశయాన్ని ఇటువంటి స్మారక చిహ్నాలు నిరంతరం గుర్తుచేస్తాయని తెలిపారు. నర్సాయిపల్లిలో ఆవిష్కరించిన కామ్రేడ్ చందు స్మారక స్థూపం ఆయన పోరాట జీవితాన్ని భావితరాలకు పరిచయం చేయడంతో పాటు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం పట్ల యువతలో అవగాహన పెంపొందించే స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం కోసం పోరాడిన నాయకుల సేవలను గుర్తుచేసుకోవడం, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

**అమరుల ఆశయాల సాధనే నిజమైన నివాళి**

అమరుల త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, వారు కలలుగన్న సమానత్వం, న్యాయం, ప్రజా సంక్షేమం వంటి విలువలను ఆచరణలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాల చరిత్రను భావితరాలకు అందించడం, ప్రజల హక్కుల పట్ల చైతన్యం కల్పించడం, సామాజిక ఐక్యతను పెంపొందించడం ద్వారా సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. నర్సాయిపల్లి గ్రామంలో నిర్మించిన అమరుడు కామ్రేడ్ చందు స్మారక స్థూపం ఆయన త్యాగాలను చిరస్మరణీయం చేస్తూ, ప్రజా పోరాటాల స్ఫూర్తిని తరతరాలకు చాటిచెప్పే చిహ్నంగా నిలవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



# దుర్గామాతగా దర్శనమిచ్చిన జగజ్జనని

**నవదుర్గలై కనువిందు చేసిన చిన్నారులు**

**మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలు**

వనపర్తి, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం వనపర్తిలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారు ఎనిమిదో రోజు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చి అభయహస్తం చూపారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అవతరించిన దుర్గామాత అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దుర్గే స్తుతా హారతి భీతిం అంటూ అమ్మ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా చిన్నారులు నవదుర్గల వేషధారణలో కనువిందు చేశారు. అమ్మవారి తొమ్మిది రూపాలైన శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి అవతారాల్లో చిన్నారులు ముస్తాబై భక్తులను ఆకట్టుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, సహస్రనామార్చనలు, లలితా పారాయణం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, తమ కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి కరుణ ఉంటే సకల శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తూ తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు మిత్ర బృందం ఘన సన్మానం

కొత్తకోట, అక్టోబర్ 18 (మనం న్యూస్): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ ఎడ్యుకేటర్ అవార్డ్స్-2026 అందుకున్న డాక్టర్ వి. సురేష్ తో పాటు, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ప్రవీణ్ కుమార్ రెడ్డిని 1992-93 బ్యాచ్ మిత్ర బృందం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న వారిని మిత్రులు అభినందించి, వారి విద్యాసేవలను ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు ఎస్పీ సురేష్ సాగర్, రంగారెడ్డి, యుగంధర్ రెడ్డి, సూరిబాబు గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, రాములు, రవి, ప్రకాష్, రాజ వర్ధన్ రెడ్డి, విజేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ సెల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

## ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి/రేవల్లి, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) : వనపర్తి నియోజకవర్గ పరిధిలోని 8 మండలాలు, 2 మున్సిపాలిటీలకు ఎస్సీ సెల్ అధ్యక్షులను జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్ ఆదివారం ప్రకటించారు. వనపర్తి పట్టణంలోని నంది హిల్స్ లో గల ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా నియమితులైన పెబ్బేరు మండల అధ్యక్షుడిగా డి. వెంకటేష్, శ్రీరంగాపురం మండల అధ్యక్షుడిగా బి. రంజిత్, గోపాల్ పేట మండల అధ్యక్షుడిగా వడ్డేమాన్ శివ,



ఏదుల మండల అధ్యక్షుడిగా పగిడాల కృష్ణయ్య, రేవల్లి మండల అధ్యక్షుడిగా మిద్దె రాములు, ఖిల్లా ఘణపురం మండల అధ్యక్షుడిగా మేదరి రాములు, పెద్దమందడి మండల అధ్యక్షుడిగా గట్టు మన్నెం, వనపర్తి పట్టణ అధ్యక్షుడిగా అనిల్ కుమార్, పెబ్బేరు టౌన్ అధ్యక్షుడిగా గాడిమూడి పరుశరాముడులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ రాజ సెల్ అధ్యక్షుడు రాజశేఖర్, కొంకి వెంకటేష్, మహేష్, రంజిత్ కుమార్, కోళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ చెస్ పోటీలకు వనపర్తి బాలిక

## అభినందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) : వనపర్తి పట్టణంలోని వెంగళరావు కాలనీకి చెందిన గీతాదుర్గ అనే బాలిక అండర్-19 విభాగంలో జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 23 నుంచి 28 వరకు ఢిల్లీలోని త్యాగరాజ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరిగే ఈ పోటీల్లో ఆమె తన ప్రతిభను ప్రదర్శించనుంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన గీతాదుర్గకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం ఆమెను అభినందించి శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే, పోటీలకు అవసరమైన ప్రయాణ ఖర్చులు, వసతి ఏర్పాట్లను తానే చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తి ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమని, ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు సాధిస్తారని అన్నారు. ఢిల్లీ పోటీల్లో గీతాదుర్గ విజయం సాధించి వనపర్తి పేరు నిలబెట్టాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎస్టీయూ

**ఎస్ టి యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఏఐఎస్టీఎఫ్ ఆడిటర్ పర్వత్ రెడ్డి**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 18 (మనం బ్యూరో) : ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ నివేదికను తెప్పించడంతో పాటు, హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని భవనంలో ఎస్టీయూ ప్రత్యేక కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఏఐఎస్‌టీఎఫ్ ఆడిటర్ ఎం. పర్వత్ రెడ్డి మాట్లాడుతూ ఎస్టీయూ 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో నిర్వహించే వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఇండోనేషియా రాజధాని జకార్తాలో 40 దేశాల ప్రతినిధులు పాల్గొన్న అంతర్జాతీయ విద్యా సదస్సులో పాల్గొని తిరిగి వచ్చిన ఎం. పర్వత్ రెడ్డిని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్టీయూ శాఖ ఘనంగా సన్మానించింది. ఎస్టీయూ 80 సంవత్సరాల ఉత్సవాలను నవంబర్ 14న ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి ప్రకటించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు కె. రమేష్, డి. ప్రభాకర్, కె. రఘురాం రెడ్డి, జిల్లా నాయకులు కర్ణాకర్ రెడ్డి, సత్యనారాయణ, బాలస్వామి, హనుమంత రెడ్డి, జమీల్ అహ్మద్, మురళి, ప్రవీణ్ కుమార్, నరసింహ, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్, మండల బాధ్యులు శివశంకర్, హుస్సేన్, నారాయణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# సర్వమంగళ ప్రాప్తి కోసం చండీ హోమం



కొత్తకోట, అక్టోబర్ 18 (మనం న్యూస్): పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన ఆదివారం దుర్గాష్టమిని పురస్కరించుకొని అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని సర్వమంగళ ప్రాప్తి కోసం భక్తులచే సామూహికంగా చండీ హోమం, త్రినాథస్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం మహిళలచే సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు సజావుగా జరిగేలా కొత్తకోట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భీమా చంద్రకాంత్ తో పాటు ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు, శంకర్, ప్రభాకర్, భీమా కిషోర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.





# పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలికి జీఎంఆర్ దంపతుల సన్మానం

కొత్తకోట, అక్టోబర్ 17 (మనం న్యూస్): కొత్తకోట పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా పి. సుధా రామ్మోహన్ రెడ్డి ఎన్నికైన సందర్భంగా దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) దంపతులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట మున్సిపల్ చైర్మన్ పి. అరుణ శ్రీనివాస్, మదనపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేశి పెంటన్న యాదవ్, ఎండి ముజీబ్, హరీష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొని సుధా రామ్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పి. సుధా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి కొత్తకోట పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమించినందుకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు.



# ప్రగతి పీఠంపై నారీ శక్తి

## జన హృదయాలలో..సుజల దీప్తి

### జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి



ఊరుకొండ అక్టోబర్ 18 (మనశీ న్యూస్) : స్థానిక మండల పరిధిలోని ఆదివారం రేవల్లి గ్రామపంచాయతీలో మహిళ సమాఖ్య భవనం మంచినీటి కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలనుదేశించి వ్యాఖ్యానిస్తూ పల్లె సీమల్లో ప్రగతి పరిమళాలు వెదజల్లుతున్నాయి .ప్రజా సంక్షేమమే పరమావధిగా, జనహితమే శ్వాసగా సాగుతున్న ప్రజాపాలనలో నియోజకవర్గ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం లిఖించబడింది. నవ సమాజ నిర్మాణానికి మూలస్తంభాలైన మహిళా లోకానికి ఆత్మగౌరవ ప్రతీకగా 'మహిళా సమైక్య భవనం',ప్రజల ఆరోగ్య రక్షణకు జీవన సంజీవనిగా 'ఫిల్టర్ వాటర్ కేంద్రం' ఒకే రోజు సాకారం కావడం అభినందనీయం.ప్రజా సమస్యల పట్ల అపారమైన అవగాహన,ఇచ్చిన మాటను నిలబెట్టుకునే అకుంఠిత దీక్ష కలిగిన మన ప్రియతమ జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డిచేతుల మీదుగా ఈ రెండు ప్రజాహిత ప్రాజెక్టులు ప్రారంభం కావడం ఈ ప్రాంత ప్రజల పూర్వజన్మ సుకృతం.చేతల్లో ప్రగతిని చూపిస్తూ,మాటల్లో మమకారాన్ని కురిపిస్తూ,నిరంతరం ప్రజా సేవలో తరిస్తున్న జననేత చొరవకు, సంకల్పబలానికి ఈ విజయాలు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. నారీ లోకానికి నవశకం. మహిళా సమైక్య భవనం ఇల్లు నడిపే ఇల్లాలే ఈ జగత్తును నడిపించగలదని చాటిచెప్పిన నారీమణుల కోసం,నిర్మించిన మహిళా సమైక్య భవనం.అద్భుతమైన నిర్మాణ కౌశలంతో శోభిల్లుతోంది.సృష్టికి మూలమైన మహిళా శక్తిని మరింత బలోపేతం చేయడానికి,వారి ఆలోచనలకు ఒక వేదికను కల్పించడానికి ఈ భవనం దోహదపడుతుంది."యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అన్న సూక్తిని నిజం చేస్తూ,మహిళల ఆర్థిక స్వావలంబనకు,సామాజిక చైతన్యానికి ఈ కేంద్రం ఒక దిక్సూచిగా మారనుంది.గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలు,పరస్పర సహకారంతో వ్యాపార,ఉపాధి రంగాలలో ముందడుగు వేయడానికి ఈ భవనం ఒక శిక్షణాలయంగా,ప్రణాళికా కేంద్రంగా ఉపయోగపడనుంది. మహిళలు కేవలం నాలుగు గోడలకే పరిమితం కాకుండా,సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనేది ఎమ్మెల్యే సుదీర్ఘ కాలపు కల.ఆ కల నేడు సాకార రూపం దాల్చింది.మహిళల సాధికారత కోసం నిరంతరం పరితపించే మన నాయకుడు,వారి ఆత్మగౌరవాన్ని ఆకాశమంత ఎత్తుకు పెంచారు. సువిశాలమైన హాల్,ఆధునిక వసతులు, కార్యాలయ నిర్వహణకు అనువైన గదులతో నిర్మించిన ఈ భవనం కేవలం ఒక కట్టడం కాదు,అది లక్షలాది మహిళల ఆశల, ఆశయాల కోట.ఇక్కడ జరిగే చర్చలు, నిర్ణయాలు ఈ ప్రాంత మహిళల జీవితాలలో వెలుగులు నింపుతాయని అనడంలో ఎలాంటి సందేహం లేదు.ఈ భవన ప్రారంభోత్సవ సమయంలో నారీమణుల కళ్ళల్లో కనిపించిన ఆనందం,వారి పెదవులపై విరిసిన చిరునవ్వులు ఎమ్మెల్యే ప్రజాదరణకు,వారి పట్ల ఉన్న కృతజ్ఞతా భావానికి నిదర్శనం.ఆరోగ్య ప్రదాత, స్వచ్ఛమైన ఫిల్టర్ వాటర్ కేంద్రం నీరే ప్రాణాధారం, స్వచ్ఛమైన నీరే ఆరోగ్య రక్ష.కలుషిత జలాల వల్ల సంభవిస్తున్న రోగాల బారి నుండి ప్రజలను రక్షించడానికి,ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఫిల్టర్ వాటర్ కేంద్రం ఈ ప్రాంతానికి ఒక వరప్రసాదం. ఈ స్వచ్ఛ జల కేంద్రం ద్వారా కేవలం దాహం తీరడం లేదు,రోగాల భయం తొలగిపోయి ప్రజల ఆయుష్షు పెరుగుతోంది.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఈ ప్రగతి ప్రయాణంలో ఇదొక మైలురాయి.ప్రజా హృదయ విజేత.ఎమ్మెల్యే అకుంఠిత దీక్ష నాయకుడంటే కేవలం అధికార పీఠంపై కూర్చునేవాడు కాదు,ప్రజా సమస్యలను తన సొంత సమస్యలుగా భావించి పరిష్కరించేవాడని నిరూపించారు మన ఎమ్మెల్యే. .ఈ రోజు ప్రారంభించుకున్న మహిళా సమైక్య భవనం మరియు ఫిల్టర్ వాటర్ కేంద్రం ఆయన దేహాశుద్ధికి,నిబద్ధతకు నిదర్శనాలు.అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ,నిధుల కొరత రాకుండా చూస్తూ,నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయించడంలో ఆయన చూపిన చొరవ అద్వితీయం. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా,నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ,వారి కష్టసుఖాలలో పాలుపంచుకునే ఇటువంటి నాయకుడు దొరకడం ఈ నియోజకవర్గ ప్రజల అదృష్టం.పల్లె మురిసింది.లక్ష్మి నవ్వింది. ఊరూరా ప్రగతి తోరణాలు,ఇంటింటా ఆనంద హేలలు. ఎమ్మెల్యే అడుగు పడితే చాలు,ఆ ప్రాంతమంతా పచ్చని తోటలా వికసిస్తుంది.మాటల్లో మధురిమ, చేతల్లో పరాక్రమం చూపించే మన నాయకుని పాలనలో పల్లెలు పట్టుగొమ్మల్లా మారుతున్నాయి. మహిళా భవనం మురిసింది.నారీలోకం మెరిసింది.నీటి తిప్పలు తప్పాయి.ప్రజల కష్టాలు గట్టెక్కాయి.చెమట చిందించి చెరువులు నింపినట్లు,నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని నిలబెడుతున్నారు.సామాన్యుడి గుండె చప్పుడు తెలిసిన నాయకుడు,పేదవాడి కన్నీరు తుడిచే బంధువు మన ఎమ్మెల్యే.ఆయన నాయకత్వంలో నియోజకవర్గం సుజల సుఫల సస్యశ్యామలంగా మారుతోంది. ఒకవైపు నారీ శక్తికి ప్రాధాన్యత ఇస్తూ,మరోవైపు జనారోగ్యానికి పెద్దపీట వేస్తూ,రెంటినీ సమతూకంతో నడిపిస్తున్న తీరు అమోఘం.ఈ ప్రగతి ఉత్సవం చూసి శత్రువులు సైతం ప్రశంసించక తప్పని పరిస్థితి నెలకొంది.ప్రగతి రథం ఇలాగే సాగాలి,ప్రజా రక్షణే ధ్యేయంగా పాలన సాగాలి.జననేత నాయకత్వం వర్ధిల్లాలి. స్థానిక సర్పంచ్ బంగారయ్య,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయ్యుబ్ పాషా,శ్రీ అభయాంజనేయ దేవాలయ చైర్మన్ చింతల మనోహర్ రెడ్డి,మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు జలపులావత్ రమేష్ నాయక్,మండల వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్ రెడ్డి,జిల్లా మైనార్టీ నాయకులు అబ్దుల్ సమీ,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వహీదొద్దీన్,పార్టీ క్రియాశీలక కార్యకర్తలు, యువకులు, మహిళలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి అలంకారంలో భవానీ మాత

మొదటి పేజీ తరువాయి

భాగంగా ఎనిమిదవ రోజైన ఆదివారం అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలు, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణతో పాటు దాతల సహాయంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

**అడ్డాకల నుంచి పాదయాత్రగా భవానీ మాలధారులు**

దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు మహబూబ్నగర్ జిల్లా అడ్డాకల మండల కేంద్రానికి చెందిన సుమారు 40 మంది భవానీ మాత దీక్షాధారులు అడ్డాకల నుంచి కొత్తకోటలోని శ్రీ అంబా భవానీ ఆలయం వరకు పాదయాత్రగా చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ అర్చకులు సురేశ్ శాస్త్రి, నవీన్ అయ్యగారు, సదాశివయ్య ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు పొగాకు మహేశ్ బాబు, ఆయన సోదరులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

మొదటి పేజీ తరువాయి

ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారుల సందడితో మైదానమంతా పండుగ వాతావరణం నెలకొంది. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా ఐదు రకాల సద్దులను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేయడంతో వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ, డీఆర్డీఓ, విద్య, మత్స్య, పంచాయతీరాజ్, సమాచార పౌర సంబంధాల శాఖలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నర్సింహులు, మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు రాధారోహిణి, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## నల్గొండ జిల్లాలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

### హాజరైన కలెక్టర్ బి చంద్రశేఖర్



నలగొండ అక్టోబర్ 18 (మనం ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం అయన ఎన్జీ కళాశాల మైదానంలో విద్య ,అటవీ, ఆర్ అండ్ బి,తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై బతుకమ్మలకు పూజలు నిర్వహించి బతుకమ్మ వేడుకలలో పల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంతో పాటు, అన్ని గ్రామాలు ,మండలాలు, రెవెన్యూ డివిజన్లలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగిందని, బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమైన మొదటి రోజు నుండి చివరి వరకు ప్రతిరోజు నాలుగైదు జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాల మైదానంలో ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించడమే కాకుండా ప్రజలు స్వచ్ఛందంగా నిర్వహించుకోవడం సంతోషమని, అన్ని మున్సిపాలిటీలలో కూడా ఈ సంవత్సరం బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారని తెలిపారు .చివరి రోజు సద్దుల బతుకమ్మ ఉత్సవాలలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని బతుకమ్మ ఉత్సవాలను విజయవంతం చేశారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తో పాటు, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు . నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, డిఇఒ సుశీంద్రరావు, ఆర్ అండ్ బి ,అటవీ శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.